
మందకొడిగా ప్రారంభమై పుంజుకున్న ఓటింగ్


మానకొండూర్: వేగురుపల్లిలో మధ్యాహ్నం బారులు తీరిన ఓటర్లు


వీణవంక: చల్లూరులో మొదటిసారి ఓటేసిన యువతి


జమ్మికుంట: పాపక్కపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

- చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్
- అక్కడక్కడ మొరాయించిన ఈవీఎంలు

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఉదయం తొమ్మిది గంటలకు 10.90 శాతం ఉన్న పోలింగ్ 11 గంటలకు 29.09, ఒంటి గంటకు 48.40, మూడు గంటలకు 61.58, సాయంత్రం ఐదు గంటలకు 70.13 శాతం పోలింగ్ నమోదైంది. అంతిమంగా రాత్రి ఏడు గంటల వరకు 75.71 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సరళిని పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి పరిశీలించారు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించినా అధికారులు పునరుద్ధరించారు. చొప్పదండిలో ఓ యువతి తన ఓటు వేరే వారు వేశారని ఆరోపించగా చివరికి ఓటుహక్కు కల్పించారు.

గంగాధర: మండలంలోని గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల సెంట్రల్ అబ్జర్వర్ అమిధ్ కటారియా ఓద్యారం గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలోని మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని బూర్గుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ర్యాలపల్లి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు పుల్కం అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై కిరణ్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

రామడుగు: మండలంలోని ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. వెదిరలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన మహిళలకు ఎంపీడీవో రాజేశ్వరి పూల మొక్కలను అందజేశారు. వెలిచాల గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలోని వెదిర గ్రామ జిల్లా పరిషత్తు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటింగ్ కేంద్రంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదఆంజనేయులుగౌడ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వెలిచాలలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ కవితలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. వెంకట్రావుపల్లిలో జడ్పీటీసీలక్ష్మీ, వన్నారంలో ఎంపీపీ జవ్వాజీ హరీశ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించగా అధికారులు వెంటనే మరమ్మతు చేశారు. దీంతో ప్రజలు తమ ఓటుహక్కును సజావుగా వినియోగించుకున్నారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే స్వగ్రామం పచ్చునూర్‌లో ఓటుహక్కు వినియోగించుకోగా, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మానకొండూర్‌లో ఓటు వేశారు. అలాగే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు,మమత కుటుంబీకులు మానకొండూర్‌లో ఓటుహక్కును వినియోగించుకోగా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం నాగరాజు మానకొండూర్‌లో ఓటు వేశారు. వృద్ధులను ప్రత్యేక వాహనాల్లో కేంద్రాల వద్దకు తరలించారు. ఉదయం 9 గంటలకు 10.06, 11 గంటలకు 24.96, మధ్యాహ్నం ఒంటిగంటకు 49.10, మూడు గంటలకు 62.55 శాతం పోలింగ్ నమోదు కాగా సాయంత్రం 71.11 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

చిగురుమామిడి: మండలంలో 73.43 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. చిన్నముల్కనూర్, సీతారాంపూర్ గ్రామాల్లో ఈవీఎంలు మోరాయించగా పోలింగ్ నిలిచిపోయింది. ఓటర్లు గంటన్నర సేపు వేచి చూశారు. చిగురుమామిడిలో ఎంపీపీ దంపతులు కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి ఓటు వినియోగించుకున్నారు. అలాగే జెడ్పీఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.మండలంలో 33,822 మంది ఓటర్లు ఉన్నారు.

గన్నేరువరం: మండలంలోని మొత్తం 18,083 మంది ఓటర్లు ఉండగా 14,580 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుషులు 7,280, మహిళలు 7,300 ఓటు వేయడంతో 80.63 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. మండలకేంద్రంలో 192 బూత్‌లోని ఈవీఎంలో సమస్య ఏర్పడటంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అలాగే 190 బూత్‌లోని ఈవీఎంలో 180 మంది ఓటు వేసిన తర్వాత సమస్యతలెత్తడంతో 50 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఖాసీంపేట గ్రామంలో 208 బూత్‌లోని ఈవీఎం సైతం మొరాయించింది. ఎస్సై తాండ్ర నరేష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికి ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ నిలిచి పోగా ఓటర్లు పడిగాపులు కాశారు. కేశవపట్నం, తాడికల్, మొలంగూర్ గ్రామాల్లో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలుసుకున్నారు. మండల కేంద్రంలో మహిళా పోలింగ్ కేంద్రానికి వచ్చిన మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పసుపు, కుంకుమ, గాజులు పెట్టి స్వాగతం పలికారు. ఎన్నికల పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ శ్రీవాణిని పసుపు, కుంకుమలతో స్వాగతం పలికారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ఉదయం మందకొడిగా మొదలై మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. 72.69 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉదయం 9 గంటలకు 9.45, 11 గంటలకు 22.89, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 39.66 శాతం నమోదయింది. భోజన విరామం తర్వాత ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరగడం ప్రారంభమైంది. మూడు గంటల వరకు 60.15, ఐదుగంటలకు 68.67 శాతం నమోదు కాగా పోలింగ్ పూర్తయ్యే వరకు 72.69 శాతం నమోదైందని అధికారులు తెలిపారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా హుజూరాబాద్ పట్టణంలో 8 ఆటోలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. హుజూరాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సీపీ అభిషేక్ మహంతి పరిశీలించారు. వీణవంక మండలంలోని చల్లూరులో బీజేపీ నాయకుడు ఆదిరెడ్డి, ఎల్బాకలో మాజీ ఉపసర్పంచ్ దేవయ్య ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఎన్నికల అధికారులు పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి, నగదు సీజ్ చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. అన్ని మండలాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. హుజూరాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఒకరికొకరు కరచాలనం చేసుకొని పలకరించుకున్నారు. అదే విధంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ హుజూరాబాద్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.వీణవంక మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకోగా, హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ హిమ్మత్‌నగర్‌లో, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

తిమ్మాపూర్: మండలంలోని అల్గునూర్ 137వ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. తిమ్మాపూర్‌లో ఎంపీపీ కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, కొత్తపల్లిలో జెడ్పీటీసీ ఇనుకొండ జితేందర్‌రెడ్డి, నుస్తులాపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.


వీణవంక: బేతిగల్ గ్రామంలో ఓటుహక్కు వినియోగించుకున్న యువకులు


ఇల్లందకుంట: బూజునూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న గ్రామస్తులు


ఇల్లందకుంటలో ఓటేసిన జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ


గంగాధర: బూర్గుపల్లిలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులు


తిమ్మాపూర్: ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


సిరా గుర్తు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కుటుంబ సభ్యులు


రామడుగు: ఓటర్లకు స్లిప్స్ అందజేస్తున్న బీఎల్‌వోలు


ఓటుహక్కు వినియోగించుకున్న వొడితెల ప్రణవ్‌బాబు కుటుంబ సభ్యులు


చిగురుమామిడి: సీతారాంపూర్‌లో ఈవీఎం మొరాయించడంతో నేలపై కూర్చున్న ఓటర్లు

క్లుప్తంగా

స్వతంత్ర భారతదేశంలో పేదరికం ఇంకా పోలేదు

సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకోసం కాకుండా వారి స్వార్థం కోసం పనిచేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని రేకొండ గ్రామంలో సోమవారం ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశంలో ఇంకా పేదరికం పోలేదన్నారు. మతం పేరుతో హిందుత్వం ఏజెండా తీసుకొచ్చి బీజేపీ ఓట్లు దండుకుంటోందన్నారు. రాజ్యాంగం ద్వారానే పేదలకు హక్కులు వచ్చాయని, బహిరంగంగానే ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని మార్చుతామంటున్నారని, దీన్ని సీపీఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇండియా కూటమే దేశానికి దశాదిశ అని అన్నారు. ఇండియా కూటమి ద్వారానే దేశ ప్రజలకు న్యాయం జరుగుతోందని, సెంటిమెంట్ రాజకీయాలతో ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయన్నారు. రెండుసార్లు అధికారం చేపట్టిన ప్రధాని మోదీ నల్లధనాన్ని ఎందుకు బయటకు తీసుకురాలేకపోయాడన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రధాని కొమ్ముకాస్తున్నారని పరోక్షంగా విమర్శించారు. దేశంలోని యువత మేల్కొంటేనే దేశభవిష్యత్ బాగుంటుందని, లేదంటే దేశం అంధకారంలోకి నెట్టబడే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు కయ్యం వీరన్న, రేకొండ గ్రామ సీపీఐ కార్యదర్శి బోయిన వల్లభాయ్‌పటేల్, పలువురు నాయకులున్నారు.

ఓటర్లను ఆకట్టుకునేలా పోలింగ్ బూత్



జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్ ఆకట్టుకుంది. ఓటర్లను ఆకర్షించడంతోపాటు ఓటింగ్ శాతం పెంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు కార్యదర్శి మనోహర్, ఎంపీవో సతీశ్‌కుమార్ తెలిపారు.


హుజూరాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి


తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో మోడల్ పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన 'బండి'


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని చిన్నములకనూర్, చిగురుమామిడి, సుందరగిరి గ్రామాల్లో పోలింగ్ సెంటర్లను బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ సరళిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... రెండోసారి ఎంపీగా గెలవబోతున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో భారతీయ జనతాపార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్‌కుమార్ వెంట ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిమ్మాపూర్: మండలంలోని అలుగునూర్ ట్రాన్స్ కో పరిధిలోని అల్గునూర్ ఫీడర్‌లో మంగళవారం లైన్ బ్రేకర్ ఏర్పాటు, చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఈసందర్భంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని, అలుగునూర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటును మించిన ఆయుధం లేదు

రాష్ట్ర బీసీ, రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి: కులమతాలకు అతీతంగా డబ్బు, మద్యంకు లొంగకుండా ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు ఆర్టీసీ బస్‌లో వెళ్తూ చిగురుమామిడిలో దిగారు. అనంతరం ఓటింగ్ సరళి ఎలా నడుస్తోందని పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఓటుహక్కుతో నచ్చిన నాయకుడిని ఎన్నుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటును మించిన ఆయుధం మరోటిలేదన్నారు. ఓటువేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దేశభవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెంట కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్, అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు పన్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పోలు స్వప్న, సంపత్, దోమ శ్రీనివాస్‌రెడ్డి, పూల లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రామడుగు: వెదిరలో ఓటేసిన మహిళలకు పూల మొక్కలను అందజేస్తున్న ఎంపీడీవో రాజేశ్వరి


మానకొండూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న రిటైర్డ్ తహసీల్దార్ పిట్టల మధునయ్య


మానకొండూర్: పచ్చునూర్‌లో ఓటేసేందుకు వచ్చి క్యూలో నిల్చోలేక టేబుల్‌పై కూర్చున్న వృద్ధులు